31-08-2014 ఓంశాంతి ఉదయము మురళి " అవ్యక్త బాప్‌దాదా " రివైజ్ - 10-12-78 మధువనము

" విస్తారాన్ని చూడకుండా సారము అనగా బిందువును చూడండి "

మధువన నివాసులు అనగా మధురత అను సాగరంలో సదా తేలియాడేవారు. బాప్‌దాదా యొక్క విశేష కర్మ భూమి, చరిత్ర భూమి, మధుర మిలనపు భూమి లేక మహోన్నత పుణ్య భూమి, ఇలాంటి భూమి పై సదా నివసిస్తున్న మీరు ఎంత మహోన్నతమైనవారు! నిరాకార తండ్రికి కూడా ఈ సాకార భూమితో విశేష స్నేహం ఉంది. ఇలాంటి భూమి పై నివిసిస్తున్న మీరు స్వయాన్ని సదా ఇలా అనుభవం చేస్తున్నారా? మధువనం అనగా మధురతతో నిండిన భూమి, మధురమైన భూమి. వృత్తిలో మధురత, వాక్కులో మధురత మరియు ప్రతి కర్మలో కూడా సదా మధురత ఉండాలి. భూమి ఎంత గొప్పదో ఆ భూమి పై ఉండేవారు కూడా అంత గొప్ప ఆత్మలు. మధువనంలో అనుభవం చేసి వెళ్లిన ఆత్మలు కూడా ఏమి చెప్తారు? మధువనం అంటే సంగమయుగ స్వర్గము అని అంటారు. అనగా మీరు స్వర్గ భూమిలో ఉండేవారు. ఇప్పుడూ స్వర్గమే, భవిష్యత్తులో కూడా స్వర్గమే. కావున డబల్ స్వర్గానికి అధికారులుగా అయిన వారు ఎంత విశేషమైన వారుగా అయ్యారు? బాప్‌దాదా ఈ రోజు విశేషంగా మధువన నివాసులను కలుసుకోవడానికి వచ్చారు. స్వర్గం యొక్క విశేషత లేక స్వర్గం యొక్క విశేష మహిమ ఏమిటి? అని బాబా అడుగుతున్నారు. స్వర్గం యొక్క విశేష మహిమ సదా సంపన్నత అనగా స్వర్గ ఖజానాలతో నిండిన స్థానము, అప్రాప్తి అనే వస్తువు ఏదీ ఉండదు. అది సంగమయుగ స్వర్గం కావచ్చు లేక భవిష్య స్వర్గం కావచ్చు రెండింటికీ ఒకే విశేషత గాయనం చేయబడింది. కావున మధువన నివాసులు అనగా సంగమయుగీ స్వర్గంలో ఉండేవారు. ఇలాంటి సంపన్న స్థితిని అనుభవం చేసుకుంటున్నారా? మేము సదా తృప్తిగా ఉన్న ఆత్మలమని అనుభవం కావాలి. ఏ విధంగా కోరిక అంటే ఏమిటో తెలియని సంస్కారము భవిష్యత్ స్వర్గంలో సహజంగా ఉంటుందో అలా మధువనంలో ఉండేవారికి ఈ సంస్కారం నేచురల్‌గా ఉందా? స్వర్గంలో ఉండేవారు అనగా ఈ విషయాలన్నీ స్వతహాగా సంస్కార స్వరూపంగా ఉండాలి. మీరు ఎక్కడి నివాసులు? అని ఎవరు అడిగినా చాలా నశాలో, సంతోషంగా మేము మధువన నివాసులము అని చెప్తారు కదా? మధువన నివాసులు అని ముద్ర పడింది. జత జతలో స్థానంతో పాటు స్థితికి కూడా ముద్ర ఉంటుంది కదా! ఏదైనా శీతలంగా ఉన్న గదికి వెళ్లగానే స్థానం ఎలాంటిదో అలాంటి స్థితి కూడా సహజంగా వస్తుంది కదా! కావున మధువనం మహిమ ఏదైతే ఉందో అలాంటి సంస్కారము తయారయిందా? ఎందుకంటే సాకార రూపంలో లక్ష్య స్వరూపంగా అందరి ముందు మధువనం ఉంది. అందరూ మధువనాన్నే కాపీ చేస్తారు. ఎవరి స్థితిలోనైనా అలజడి వస్తే మధువనం అచల్‌ఘర్‌కు వెళ్లినట్లయితే అచలంగా అవుతారని అచల్‌ఘర్ మధువనాన్ని గుర్తు చేసుకుంటారు కదా! ఇలాంటి భావనతో, శుభకామనతో అందరూ ఈ పుణ్యభూమికి వస్తారు. అనేకమంది ఆత్మలకు అలజడిని తొలగించే సాధనం లభించే స్థానం అచల్‌ఘర్ మధువనం అయినప్పుడు మధువనంలో ఉండేవారు కూడా సదా అచంచలంగా

ఉంటారు కదా! ఇలాంటి స్థితి అనేకమంది ఆత్మల కొరకు మార్గాన్ని చూపించే విధంగా ఉంటుంది ఎందుకంటే మధువనం అనగా లైట్ హౌస్. అన్ని సేవాకేంద్రాలకు సహయోగాన్ని ఇచ్చేవారు మధువన నివాసులే. సదా సంకల్పం, మాట మరియు కర్మలలో ఒకరికొకరు సహయోగులుగా ఉంటే జతలో ఉన్నవారికి కూడా సహయోగులుగా ఉంటారు కదా! పిల్లలందరికీ ఫలితం చూపించుటకు ఒక సంవత్సర కాలం లభించింది. ఈ సంవత్సరంలో ఏమి పరివర్తన తీసుకొచ్చారు? అది మీ ద్వారా విని ఇతరులు కూడా స్వయం పరివర్తన కావాలి. ఏ విధంగా చాలా సార్లు కొంతమంది ఆత్మలు తమ సత్యమైన హృదయంతో, ఉత్సాహంతో తండ్రి పై స్నేహంతో అనుభవాన్ని వినిపిస్తున్నప్పుడు అనుభవం వింటూ, వింటూ కూడా అనేకమంది ఆత్మలు పరివర్తన అవుతున్నట్లు చూస్తాము. ఒక్కరి పరివర్తన అనేక మంది ఆత్మల పరివర్తనకు సాధనంగా అవుతుంది. ఇలా అనేకమందికి ఒక ఉదాహరహణ రూపమయ్యే పరివర్తన జరిగిందా? ఈ ఒక్క సంవత్సరంలో ఇలాంటి అద్భుతమైన అనుభవం ఏదైనా అయ్యిందా? ఎవరెవరు హైజంప్ చేశారు? ఎవరు లిఫ్ట్ యొక్క గిఫ్ట్ తీసుకున్నారు?

ఏ విధంగా ఈ రోజుల్లో టీ.విలో ఒక స్థానం యొక్క చిత్రము నలువైపులా స్పష్టంగా కనిపిస్తుందో అలా మధువనం కూడా టీ.వి స్టేషన్. నలువైపులా టీ.వి సెట్‌లు పెట్టబడి ఉన్నాయి. ఏ విధంగా ఈ రోజుల్లో సైన్సు సాధనాల ద్వారా సంకల్పాల గతి లేక మనసా స్థితిని చెకింగ్ చేసుకోగల్గుతున్నారో, అలా మధువన నివాసుల సంకల్పాల గతి లేక మానసిక స్థితి నలువైపులా వ్యాపిస్తుంది. అందువలన ప్రతి సంకల్పం పై గమనము ఉండాలి. దీనిలో నిర్లక్ష్యం, సోమరితనం ఉండరాదు. మధువన నివాసులు మధువనంలో కూర్చొని ఉన్నా విశేష సంకల్పం ద్వారా ఎలాంటి వైబ్రేషన్స్ వ్యాపింప చేయాలనుకున్నా నలువైపులా వ్యాపింపజేయగల్గుతారు. ఏ విధంగా స్థూల వస్తువుల సుగంధం నలువైపులా స్వతహాగానే వ్యాపిస్తుందో అలా ఈ వైబ్రేషన్స్ సంకల్పాల ద్వారా నలువైపులా స్వతహాగానే వ్యాపించాలి. మధువన నివాసులకు ఇది విశేషమైన సేవ. మధువనంలో ఏదైనా విశేషంగా భట్టీ చేస్తున్నట్లయితే దాని వైబ్రేషన్స్ నలువైపులా వ్యాపిస్తాయి కదా! లెటర్స్ ద్వారా సమాచారం వెళ్లకపోయినా మధువన సూక్ష్మ వైబ్రేషన్స్ నలువైపులా చాలా సహజంగా వ్యాపించగలవు. కర్మ ద్వారా కర్మణా సేవ మీ బాధ్యతగా చేస్తారు కానీ జత జతలో మనసా సేవ గురించి కూడా బాధ్యత ఉందా? బాప్‌దాదా సంవత్సరం ఫలితాన్ని చూడటానికి వచ్చారు కదా! ఎవరైతే దగ్గరగా ఉంటారో వారు గౌరవపూర్వకంగా ఎంతవరకు పాసయ్యారు? మహాన్ ఆత్మల జతలో ఉన్నారు. సాకారంలో కూడా దగ్గరగా ఉన్నారు, స్థానం కూడా మహోన్నతమైనది. ఇలాంటి ఆత్మల ప్రాలబ్ధం ఎలా తయారవుతుంది? శాస్త్రాలలో కూడా మధువనం మహిమ విశేషంగా మహిమ చేయబడింది. కావున మధువనం నివాసులు అంటే ప్రతి విషయంలో విశేష ఆత్మలు. ప్రతి సమయం ఏదో ఒక విశేషతను చూపించేవారు. ఏ గ్రూప్ వచ్చినా మధువనంలో ఉండేవారికి ఈ విశేషత ఉంది, మధువన స్వర్గంలో ప్రతి ఆత్మ సదా తృప్తిగా ఉన్న ఆత్మగా, సంపన్న మూర్తిగా ఉన్నారు అని అనుభవం చెయ్యాలి.

దీనికి ఆధారము “మేము దాత పిల్లలుగా అయ్యి సర్వాత్మలకు ఇవ్వాలి ” కాని తీసుకోకూడదని సదా ఒకే లక్ష్యము ఉండాలి. వీరు చేస్తే నేను చేస్తానని కాదు. ప్రతి ఒక్కరూ దాతా స్థితి యొక్క భావన ఉంచుకుంటే అందరూ ఇచ్చేవారిగా అనగా సంపన్న ఆత్మలుగా కాగలరు. సంపన్నులుగా కాకపోతే ఇవ్వలేరు.

ఎవరైతే సంపన్న ఆత్మగా ఉంటారో వారు సదా తప్పకుండా తృప్తి కలిగిన ఆత్మగా ఉంటారు. నేను దాత బిడ్డను, ఇవ్వడమే తీసుకోవడమని భావించాలి. ఎంత ఇస్తారో అంత తీసుకుంటారు. ప్రాక్టికల్‌గా తీసుకొనేవారిగా కాదు ఇచ్చేవారిగా కావాలి. దాతా స్థితి సదా నిర్విఘ్నంగా, కోరిక అంటే ఏమిటో తెలియని స్థితిని అనుభవం చేయిస్తుంది.

సదా ఒకే లక్ష్యము వైపే దృష్టి ఉండాలి. ఆ లక్ష్యము బిందువు. ఒకే లక్ష్యము అనగా సదా బిందువు వైపే చూసేవారు. ఇతర ఏ విషయాలను చూస్తున్నా చూడకండి. దృష్టి ఒక్క బిందువు వైపే ఉండాలి. స్మృతిచిహ్న రూపంలో కూడా చేప వైపు దృష్టి లేదు కానీ కంటిలో ఉన్న బిందువు పైన ఉంది అని చూపించారు. చేప విస్తారం అయితే సారం బిందువు. విస్తారాన్ని చూడలేదు కానీ సారము అనగా ఒక్క బిందువును చూశాడు(అర్జునుడు). అదే విధంగా ఒకవేళ ఏ విషయంలోని విస్తారాన్ని చూచినా విఘ్నాలలోకి వస్తారు. సారము అనగా ఒక్క బిందు రూప స్థితి తయారవుతే ఫుల్‌స్టాప్ అనగా బిందువు పెట్టబడుతుంది. కర్మలో కూడా ఫుల్‌స్టాప్ అనగా బిందువు, స్మృతిలో కూడా బిందువు అనగా బీజరూప స్థితి తయారవుతుంది. విశేషంగా ఈ అభ్యాసం చేయాలి. విస్తారాన్ని చూస్తున్నా చూడరాదు, వింటున్నా వినరాదు. ఇది ఇప్పటి నుండే అభ్యాసం కావాలి. అప్పుడే అంతిమ సమయంలో నలువైపులా అలజడితో కూడిన చాలా దు:ఖము కలిగించే శబ్ధాలు, అతిభయంకరమైన దృశ్యాలు ఉన్నప్పుడు వాటిలో పాస్ కాగలరు. ఇప్పటి విషయాలు, ఇప్పుడు ఉన్న పరిస్థితులు ఆ సమయంతో పోలిస్తే అసలు ఏమీ లేదు. ఒకవేళ ఇప్పటి నుండే చూస్తూ కూడా చూడకుండా, వింటూ కూడా వినకుండా ఉండే అభ్యాసం లేకపోతే అంతిమంలో ఈ భయంకరమైన దృశ్యాన్ని చూస్తూ ఒక్క క్షణం పేపర్‌లో సదా కాలం కొరకు ఫెయిల్ మార్కులు లభిస్తాయి. అందువలన ఇలాంటి అభ్యాసం విశేషంగా కావాలి. సాకార శరీరం కూడా ఆకారీ రూపంలో అనుభవం అయ్యే స్థితి ఉండాలి. ఏ విధంగా ఆకారీ రూపంలో చూశారు కదా. సాకార శరీరం కూడా ఆకారీ ఫరిస్తా రూపంగా అనుభవం చేశారు కదా! నడుస్తూ తిరుగుతూ, కార్యం చేస్తూ ఆకారీ ఫరిస్తాగా అనుభవం చేసేవారు. శరీరం అదే ఉండేది కానీ స్థూల శరీర భారము తొలగిపోయిన కారణంగా స్థూల శరీరం ఉన్నప్పటికీ ఆకారీ రూపంగా అనుభవం చేసేవారు. కావున ఇలాంటి అభ్యాసం మీ అందరికీ ఉండాలి. కర్మేంద్రియాల ద్వారా కర్మ జరుగుతూ ఉండాలి. కానీ మనసా శక్తి ద్వారా వాయుమండలం శక్తిశాలిగా, స్నేహ సంపన్నంగా, సర్వుల సహకారంతో కూడిన వైబ్రేషన్స్ వ్యాపించి ఉండాలి. ఏ స్థానానికి వెళ్లినా ఈ ఫరిస్తా రూపం కనిపించాలి. కర్మ చేస్తున్నారు కానీ ఒకే సమయంలో కర్మ మరియు మనసా రెండు సేవల బ్యాలన్స్ ఉండాలి. ప్రారంభంలో ఈ అభ్యాసం చేయించేవారు. కర్మ భలే చాలా సాధారణంగా ఉన్నా స్థితి ఎంత మహోన్నతంగా ఉండాలంటే సాధారణ కర్మలు చేస్తున్నా సాక్షాత్కార మూర్తులుగా కనిపించాలి. ఏ స్థూల కార్యం అయినా బట్టలు ఉతకడం, శుభ్రం చేయడము, వంట గదిలో పని చేసేవారు కానీ స్థితి చాలా ఉన్నతంగా ఉండేది. ఇలాంటి సమయం కూడా ప్రాక్టికల్‌గా వస్తుంది. చూసేవారు ఇంత గొప్ప మహిమ కలిగిన ఆత్మలు ఫరిస్తా రూపంలో ఎంత సాధారణ కార్యం చేస్తున్నారని వర్ణన చేస్తారు. పని సాధారణము కాని స్థితి అతిశ్రేష్ఠము. ఏ విధంగా సత్యయుగ రాజవంశ ఆత్మలు వచ్చినప్పుడు వారి భవిష్య రూపాన్ని ప్రాక్టికల్‌గా చూస్తూ ఇంత గొప్ప మహారాజులు ఎంత చిన్న కార్యం చేస్తూ ఉన్నారని ఆశ్చర్యపోయేవారు. విశ్వ మహారాజులు భోజనం తయారు

చేస్తూ ఉన్నారు. అలాగే రాబోయే ఆత్మలు, మాకు పూజ్యులు, శ్రేష్ఠులైన ఇష్ట దేవతలు ఈ కార్యం చేస్తున్నారా? అని వర్ణన చేస్తారు. నడుస్తూ, తిరుగుతూ ఇష్టదేవత లేక దేవీల సాక్షాత్కారం స్పష్టంగా కనిపించాలి. అంతిమ సమయంలో పూజ్య స్వరూపాన్ని ప్రత్యక్షంగా చూడటం మొదలవుతుంది. ఫరిస్తా రూపం ప్రత్యక్షంగా కనిపిస్తుంది. కల్పం ముందు కూడా అర్జునుని గాయనం ఉంది కదా! సాధారణ స్నేహితుడి రూపాన్ని కూడా చూశాడు కానీ వాస్తవిక రూపం సాక్షాత్కారం చేసుకున్న తర్వాత మీరు ఎవరు? అని వర్ణన చేస్తాడు. ఇంత శ్రేష్ఠమైనవారు, కాని సాధారణ స్నేహితుడి రూపం. ఈ విధంగా నడుస్తూ, తిరుగుతూ మీ సాక్షాత్కారాలు కూడా అవుతాయి. దివ్య దృష్టితో చూడటం అది వేరే విషయం. మొదట్లో నడుస్తూ, తిరుగుతూ చూసేవారు కదా. ఇది ధ్యానంలోకి వెళ్ళి చూసే విషయం కాదు. ఎలాగైతే ఒక్క సాకార తండ్రిని ఆదిలో అనుభవం చేశారో అలా ఇప్పుడు అంతిమంలో అందరూ సాక్షాత్కారమవుతారు. ఈ సాధారణ రూపం అదృశ్యమైపోతుంది. ఫరిస్తా రూపం లేక పూజ్యరూపాన్ని అందరూ చూస్తారు. ఏ విధంగా ఆదిలో ఆకారీ బ్రహ్మ మరియు శ్రీకృష్ణుని రూపం జత జతలో సాక్షాత్కారం అయ్యేదో అలా ఇప్పుడు కూడా ఈ సాధారణ రూపం చూస్తూ ఉన్నా కనిపించకూడదు. అప్పుడే అనేకమంది ఆత్మలకు మహాన్ ఆత్మలైన మీ సాధారణ రూపం చూస్తూ కూడా కనిపించదు. తెరచి ఉంచిన నేత్రాలకు ఒక్క సెకండ్‌లో సాక్షాత్కారం అవుతుంది. ఇలాంటి స్థితిని తయారు చేసుకొనుటకు విశేషంగా చూస్తూ కూడా చూడకుండా, వింటూ కూడా వినకుండా ఉండే విశేష అభ్యాసం తెలిపారు. ఒక్క విషయమే వినండి, ఒక్క బిందువునే చూడండి. విస్తారాన్ని చూడకుండా ఒక్క సారాన్ని చూడండి. విస్తారాన్ని వినడకుండా సదా సారాన్నే వినండి. అప్పుడు ఈ మధువనం ఇంద్రజాల నగరంగా తయారవుతుంది. మధువనం మహత్యాన్ని అనగా మధువనంలో ఉండేవారి మహత్యాన్ని విన్నారు కదా! మంచిది.

మధువనంలోని సోదరీలతో:- మధువనం శక్తి సైన్యం అనగా విశేష ఆత్మల సైన్యము. ప్రతి ఒక్కరికీ తమ విశేషత బాగా తెలుసు కదా! విశేషత కారణంగానే విశేష భూమిలో నివసించేవారిగా అయ్యారు. ఈ సంతోషం ఉంటుందా? వెనుకటి ఖాతా ప్రతి ఒక్కరికి ఎవరిది వారికి ఉంది. అది సమాప్తము కూడా అవుతూ ఉంటుంది కానీ తోడు తోడుగా డ్రామానుసారంగా ఏదో ఒక విశేషత కూడా ఉంది. అందుకే విశేష పాత్ర లభించింది. సదా పుణ్యభూమి మరియు శ్రేష్ఠ ఆత్మల సాంగత్యంలో ఉండే విశేష పాత్ర, ఇది కూడా తక్కువ భాగ్యమేమీ కాదు. జడచిత్రాల మందిరం యొక్క పూజారులు కూడా తమను తాము ఎంత గొప్పవారిగా భావిస్తారు. పూజారులే అయినా వారికి ఎంత నషా ఉంటుంది! ఎందుకంటే విగ్రహానికి సమీప సంబంధంలో ఉన్నామని భావిస్తారు. జడచిత్రాల పూజారులే ఇంత నషాతో ఉంటారు. ఇక్కడ పూజారి అను విషయమే లేదు. ఇక్కడ సంపర్కంలో ఉండేవారు, సాంగత్యంలో ఉండేవారు, జతలో తోడుగా ఉన్న మీకు ఎంత నషా మరియు సంతోషం ఉండాలి. ఈశ్వరీయ పరివారంలోకి వచ్చిన ఆత్మకు ఏ విశేషత లేకపోవడం అనేది ఉండజాలదు. కావున తమ విశేషతను తెలుసుకొని దానిని కర్మలో వినియోగించండి. ఏ గుణం అయినా, విశేషత అయినా, కర్మణా సేవ చేసే గుణం కావచ్చు, మధురతా గుణం కావచ్చు, స్నేహ గుణం కావచ్చు దానిని కార్యంలో వినియోగించండి. ఏ విధంగా ఇనుము పరశువేదికి అంటుకుని బంగారంగా అవుతుందో అలా ఒక్కగుణం లేక విశేషతను సేవలో వినియోగిస్తే సేవాఫలము ఒకటికి లక్షరెట్లు లభిస్తుంది. ఆ ఒక్క విశేషత అనేక సమయాలలో ఫలం ఇవ్వడానికి అర్హముగా తయారవుతుంది. ఏ విధంగా ఒక్క

విత్తనం వేస్తే అనేక ఫలాలు వస్తాయో అలా ఒక్క విశేషతను కూడా కర్మలో వినియోగించడం అంటే భూమిలో విత్తనం నాటడం వంటిదే. కనుక ఎంత అదృష్టవంతులో అర్థమయిందా? బ్రాహ్మణ పరివారంలో జన్మించినారంటే జన్మతో పాటు ఏదో ఒక విశేషత యొక్క భాగ్యాన్ని వెంట తీసుకొనే వచ్చారు. కేవలం దానిని కార్యంలో ఎంతవరకు వినియోగిస్తున్నారో అందులో తేడా వచ్చేస్తుంది. ఇది జన్మతోనే లభించిన భాగ్యము. కానీ భాగ్యాన్ని కర్మలో లేక సేవలో వినియోగించినట్లయితే అనేక సమయాలకు లేక అనేకసార్లకు భాగ్యం యొక్క ఫలం తీసుకుంటారు. బీజాన్ని నాటే ఈ పద్ధతి రావాలి. ఫలం తప్పక లభిస్తుంది. బీజం నాటడం అనగా విశేషతలనే బీజాన్ని సేవలో వినియోగించడం. ఇక్కడ అందరూ సదా భాగ్య సింహాసనానికి అధికారులే ఉన్నారు. ఈ భాగ్యం కోసం కల్పం ముందు స్మృతి చిహ్నంలో కూడా ఇప్పటి వరకు ఒక్క సెకండ్ అయినా దగ్గరగా ఉండటం మహోన్నత భాగ్యంగా భావిస్తారు. మరి ప్రత్యక్షంగా ఉన్న మీ సంతోషం మరియు మీ భాగ్యం ఎంత శ్రేష్ఠమైనది. శ్రేష్ఠతను ఎదురుగా ఉంచుకుంటే వ్యర్థ మాటలు సమాప్తమైపోతాయి. మంచిది.

వరదానము:- "భయంకర రూపములోని మాయ యొక్క ఆటను సాక్షిగా చూసే మాయాజీత్ భవ"

మాయకు స్వాగతం చెప్పేవారు దాని భయంకర రూపాన్ని చూసి భయపడరు. సాక్షిగా ఉండి ఆటను చూస్తే ఆనందం కలుగుతుంది. ఎందుకంటే మాయది బయట నుండి పులి రూపం కానీ దానిలో పిల్లికున్నంత శక్తి కూడా లేదు. కేవలం మీరు భయపడి దానిని పెద్దదిగా చేసుకుంటారు. ఏమి చెయ్యను, ఎలా అవుతుందో....... కానీ ఏదైతే జరుగుతూ ఉందో అది మంచిది, జరగబోయేది ఇంకా మంచిది అను పాఠం జ్ఞాపకం ఉంచుకోండి. సాక్షిగా ఉండి ఆటను చూస్తే మాయాజీతులైపోతారు.

స్లోగన్:- " ఎవరైతే సహనశీలురుగా ఉంటారో వారు ఎవ్వరి భావ-స్వభావాలలో కాలిపోరు, వ్యర్థ మాటలను ఒక చెవితో విని ఇంకొక చెవితో వదిలేస్తారు "